
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
నంద్యాల జిల్లా వార్తలు 5
సోమవారం 9 డిసెంబరు 2024



దద్దరిల్లిన జడ్పీ..!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య



ఎమ్మెల్యే పార్థసారథి ప్రసంగానికి అడ్డుతగులుతున్న జడ్పీటీసీ సభ్యులు

- ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై రచ్చ
- ఎమ్మెల్యేలు, జడ్పీటీసీల మధ్య వాగ్వాదం
- బ్రాహ్మణకొట్కూరులో మద్యం దుకాణంపై దుమారం
- వాడివేడిగా జడ్పీ సమావేశం
- హాజరైన మంత్రి భరత్, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ సమావేశం వాడివేడిగా సాగింది. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధులపై జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేల నడుమ తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఆదివారం కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు పి.రంజిత్‌బాషా, రాజకుమారి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముందుగా ఉదయం 9 గంటలకు జడ్పీ మినీ సమావేశంలో భవనంలో 1, 2కు సంబంధించి స్థాయి సంఘ సమావేశాలకు జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. డీఆర్‌డీఏ, డ్వామాకు సంబంధించిన శాఖలపై చర్చించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సుమారు 5,924 పనులకు రూ.65,91,90,046 నిధులకు సభ్యులు తీర్మానించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యావ్యవస్థను బలోపేతం చేసే విధంగా టీచర్ల కొరత నివారించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకురావడానికి సభ్యులు సమావేశంలో లేవనెత్తారు.ఈ మేరకు జడ్పీ చైర్మన్ ప్రభుత్వానికి ఈ విషయాన్ని పంపిస్తూ సభలో ఆమోదిస్తూ తీర్మానం చేశారు.



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

● ఆర్థిక సంఘం నిధులపై వాగ్వాదం

కూటమి ప్రభుత్వం వచ్చాక 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. అయితే తమ హయాంలో విడుదలైన నిధులను ఖర్చు చేయకుండా వైసీపీ సర్పంచులు గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించి జమ చేసుకోవడం దారుణమన్నారు. వైసీపీకి చెందిన సర్పంచులు ఊళ్లకు ఊళ్లు దోచుకుంటున్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇంతలో కొత్తపల్లి జడ్పీటీసీ సుధాకర్ కలగజేసుకుని సర్పంచులపై ఆరోపణలు చేయడం తగదని ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు రాకపోవడంతోనే సర్పంచులు ప్రస్తుతం వచ్చిన నిధులను జమ చేసుకుంటున్నారు.. ఇందులో తప్పేముందని అన్నారు. చేసిన దుర్మార్గాలు బయటపెడితే ఎందుకు జంకుతున్నారని ఆదోని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. తాను మాట్లాడుతుంటే ఎందుకు మధ్యలో కలగజేసుకుంటారని ఆదోని ఎమ్మెల్యే జడ్పీటీసీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతబకాయిలలో జమచేసుకుంటున్న వాటిపై విచారణ జరిపించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయ సూర్య పట్టుబట్టారు.

మిగతా 7వ పేజీలో..

అధికారులు ఏం చేస్తున్నారు

- టీజీ భరత్, మంత్రి

తాగునీటికి సంబంధించి వేసిన టెండర్లలో కాంట్రాక్టర్లు తక్కువకు కోట్ చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారు. రెండు నెలల నుంచి ఇదే ప్రక్రియ జరుగుతుంటే కూడ చూసుకోవాల్సిన పరిస్థితి లేదా? రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి మరమ్మతు పనులు నాణ్యతతో జరిగేలా చూడండి. టెండర్లలో 30-40 శాతం తక్కువ చేసి కోట్ చేస్తే మరమ్మతు పనులు ఏ విధంగా నాణ్యతతో చేస్తారు. 20 శాతం తక్కువ కోట్ చేస్తేనే పనులు నాణ్యతతో ఉండవు.. అలాంటిది సుమారు 40 శాతం మేరకు తక్కువ చేసే పనుల్లో నాణ్యత ఉంటుందా? ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి స్కీంలపై వివరాలు అందజేయాలి. ఆదోని మండలం సంబగల్లులో మురుగుల కాలవలు వెళ్తున్న లైన్‌లోనే తాగునీటి పైప్‌లైన్ ఉండటం వల్ల డయేరియా లాంటి వ్యాధులు సోకే ప్రమాదముంది. వచ్చే సమావేశం నాటికి ఈ విషయాన్ని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రజాప్రతినిదులు చెప్పిన సమస్యలపై వెంటనే స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలి.

నేడు ప్రజా వినతుల స్వీకరణ : కలెక్టర్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్‌గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు ఉదయం 9:30 గంటలకు హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్‌స్థాయిలో కూడా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆమె వెల్లడించారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

- 459 మంది సిబ్బందితో ఈగల్ టీమ్
- ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన సదస్సులు
- ఈగల్ చీఫ్ ఐజీ ఆకే రవికృష్ణ



7లో

దిగొచ్చిన టమోటా

● ఎమ్మిగనూరు మార్కెట్‌లో 20 కిలోల బాక్స్ రూ.300




గోనెగండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా అధిక రేట్లకు అమ్ముడపోయిన టమోటా ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. ఎమ్మిగనూరు మార్కెట్‌లో 20 కిలోల బాక్స్ రూ.350 నుంచి రూ.300 వరకు పలికింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారులు రూ.100కు ఆరు కిలోల ప్రకారం ఆటోల్లో తిరిగి విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో నాలుగు రోజుల వ్యవధిలో కిలో రూ.50 నుంచి రూ.16కు ధర తగ్గడంతో వినియోగదారులు ఉపశమనం పొందుతున్నారు. ఇప్పటి వరకు గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాలలో దాదాపు 200 ఎకరాల్లో టమోటా సాగు చేశారు. బావులు, బోర్ల కింద సాగు చేసిన పంట 15 రోజుల్లో మరో 200 ఎకరాల్లోని పంట కోతకు వచ్చే అవకాశం ఉంది. దీంతో ధర మరింత తగ్గనుంది.

శ్రీగిరిపై భక్తుల రద్దీ



క్యూలైన్‌లో భక్తుల రద్దీ



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శ్రీశైలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహా క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్షేత్ర వీధులన్నీ రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తులు వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలను జరిపారు.

దేవస్థానంలోని నిత్యకళారాధనలో ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన నటరాజ కూచిపూడి కళానిలయం బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణపతి కౌత్వం, మూషిక వాహన, వక్రతుండం, తాండవ గణపతి, శంభో శివ శంభో తదితర గీతాలకు నిత్యశ్రీ, సహస్ర, లిఖిత, భారతి, కీర్తన, శ్రవంతి, రజని, లావణ్య తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.



కళాకారుల నృత్య ప్రదర్శన



ఖజానా ఖాళీ..!

- విద్యార్థుల ఫీజుల నుంచే జీతాలు
- ఏటా రూ.10 కోట్లు చెల్లిస్తున్న ఆర్‌యూ
- భారంగా మారిన 296 మంది ఉద్యోగులు వేతనాలు

కర్నూలు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ద్రావిడ వర్సిటీ పరిస్థితే రాయలసీమ యూనివర్సిటీకి రానుందా.. విద్యార్థుల ఫీజుల నుంచి జీతాలు చెల్లించడంతో ఖజానా ఖాళీ కానుందా.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అవుననే చెప్పాలి. పొరుగు సేవల కింద అడ్డగోలుగా ఉద్యోగాలు ఇచ్చిన ద్రావిడ వర్సిటీ వారి జీతాల చెల్లింపునకు విద్యార్థుల ఫీజులను వాడుకోవడంతో ఖజానా ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాయలసీమ యూనివర్సిటీలోనూ ఇదే పరిస్థితి నెలకొందని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులు చెల్లించిన ఫీజుల నుంచి ఏటా రూ.10 కోట్ల దాకా ఉద్యోగులకు జీతాలు చెల్లించడమే ఇందుకు కారణం. రాష్ట్రంలో 12బీ గుర్తింపు ఉన్న వర్సిటీలో రాయలసీమ యూనివర్సిటీ ఒక్కటి. ఇందులో ఏడుగురు అధ్యాపకులు మాత్రమే సీఎఫ్ఎంఎస్ నుంచి జీతాలు తీసుకుంటున్నారు. మరో 24 మంది నాన్ టీచింగ్ రెగ్యులర్ ఉద్యోగులకు ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ నుంచి జీతాలు గత జూన్ 5 నుంచి నిలిపివేసింది. దీంతో వారికి వర్సిటీ నుంచి విద్యార్థుల ఫీజుల నుంచి జీతాలు ఇస్తున్నారు. ఇప్పుడే ఇదే యూనివర్సిటీకి పెనుభారంగా మారింది. 2017లో 102 మంది ఉద్యోగులకు టైం స్కేల్ గుర్తింపు ఇవ్వడం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకమని, రద్దు చేయాలని అప్పటి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు వర్సిటీ ఉపకులపతులను ఆదేశించినా పట్టించుకోలేదు. దీంతో వర్సిటీ ఉద్యోగులకు నెలకు రూ.80 లక్షల ప్రకారం ఏడాదికి రూ.10 కోట్ల మేర జీతాలు చెల్లించాల్సి వస్తోంది. అయితే ఈ మొత్తం విద్యార్థుల ఫీజులు, ప్రైవేట్ డిగ్రీ, బీఈడీ కళాశాలల నుంచి వచ్చే డబ్బుతో సర్దుబాటు చేస్తున్నారు. ఇలా చేయడం ఎంత వరకు సమంజసమని కొందరు ప్రొఫెసర్లు అంటున్నారు. దీంతో రాయలసీమ యూనివర్సిటీ ఖజాన ఖాళీ అయి ద్రావిడ వర్సిటీ తరహాలో అవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

● ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

జీతాలు విద్యార్థుల ఫీజుల నుంచి ఇస్తున్న మాట వాస్తవమే. ఆ సమస్యపైనే దృష్టి సారించాను. గతంలో జాప్యం ఎందుకు జరిగిందో నాకు తెలియదు. సీఎఫ్ఎంఎస్ డేటాలో ఉద్యోగులను చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నత విద్యామండలికి ఫైలు సిఫారసు చేస్తున్నాం.

- బోయ విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, రాయలసీమ యూనివర్సిటీ

కందిపోయింది..!

● తుఫాన్ దెబ్బకు కుదేలైన రైతాంగం ● 6879 హెక్టార్లలో కంది పంట సాగు

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ రైతులకు కష్టాలు తప్పడం లేదు. తుఫాన్ దెబ్బతో తీవ్ర నష్టం మిగిలింది. ఏ ఏడాది వేలాది ఎకరాల్లో కంది పంటను రైతులు సాగు చేశారు. చాలా మండలాల్లో మెట్ట ప్రాంతాల్లో కంది సాగుపై రైతులు ఆసక్తి చూపారు. బనగానపల్లె సబ్ డివిజన్, కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లో విస్తారంగా ఖరీఫ్‌లో కంది పంటను రైతులు సాగు చేశారు. ఈ ఏడాది సాగు చేసిన వరి పంట దిగుబడి బాగా వచ్చినప్పటికీ తుఫాన్ ప్రభావానికి తోడు ధరలు లేకపోవడంతో వరి రైతు కష్టాల్లో కూరుకుపోయారు. అలాగే కంది పంట ఏపుగా పెరిగి పూత దశలో తుఫాన్ రావడంతో పూత రాలిపోయి చాలా చోట్ల కొమ్మలు మిగిలాయి. దీంతో కంది పంట వేసిన రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.

బనగానపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలో ఖరీఫ్‌లో బనగానపల్లె, కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లో 6869 హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. బనగానపల్లె సబ్ డివిజన్‌లోని బనగానపల్లె మండలంలో 3500 హెక్టార్లలో, కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లో 3369 హెక్టార్లలో కంది సాగు చేశారు. కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లోని అవుకు మండలంలో 475 హెక్టార్లలో, కొలిమిగుండ్ల మండలంలో 704 హెక్టార్లలో, సంజామల మండలంలో 621 హెక్టార్లలో, ఉయ్యాలవాడ మండలంలో 795 హెక్టార్లలో, దొర్నిపాడు మండలంలో 377 హెక్టార్లలో, కోవెలకుంట్ల మండలంలో 397 హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. వర్షాధారం పంటల కింద, బోర్ల కింద, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల కింద పంటలు సాగు చేశారు.

పూత దశలో తుఫాన్‌తో దెబ్బతిన్న కంది పంట

పూత దశలో ఇటీవల కురిసిన తుఫాన్ కంది రైతులను కుంగదీసింది. మొదట వాతావరణం అనుకూలించడం సకాలంలో వర్షం కురవడంతో పంట బాగా వస్తుందని రైతులు ఆనందంతో ఉండేవారు. పంట దెబ్బతికుండా సమయానికి పురుగుల మందు కొట్టడం, అంతర్ సేద్యాలు చేయడంతో పంట బాగా పండుతుందని రైతులు సంతోషంతో ఉన్నారు. అయితే ఇటీవల కురిసిన తుఫాన్ రైతులను కుంగదీసింది. తుఫాన్ వర్షంతో పూత పూర్తిగా రాలి కంది కర్రలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఎకరా సేద్యం ఖర్చుతోపాటు విత్తనాలు, మందుల పిచికారి కోసం ఎకరాకు సుమారు రూ.20 వేలకుపైగా రైతులు ఖర్చు చేశారు. అర క్వింటా కూడా రావడం కష్టమే. ఇటీవల కురిసిన తుఫాన్ దెబ్బకు పూతరాలడంతో కంది పంట పూర్తిగా దెబ్బతింది. వాతావరణ మార్పులతో పూత దశలో కురిసిన తుఫాన్ ప్రభావంతో కంది పంట పూర్తిగా దెబ్బతింది.



తుఫాన్ ప్రభావంతో పూత రాలిపోతున్న కంది పంట

ఏటా నష్టమే.. అర క్వింటా కూడా వచ్చే పరిస్థితి లేదు



ప్రతి ఏడు నష్టాలు రావడంతో పంటను మార్పిడి చేసి కంది పంట వేశా. ఐదు ఎకరాల్లో కంది సాగు చేశా. మందులు, పిచికారి, సేద్యపు ఖర్చులకు భారీగా ఖర్చు పెట్టాం. పూత దశలో కురిసిన తుఫాన్ వర్షం తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఎకరాలకు అర క్వింటాళ్ల కందులు వచ్చే పరిస్థితి లేదు.

- తిరుమల చెన్నయ్య, ఎర్రగుడి

ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి



ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. కంది పంట వేసిన రైతులు తుఫాన్ దెబ్బకు నష్టపోయాం. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం అందించి కంది రైతులను ఆదుకోవాలి. ఎకరాకు రూ.20 వేలు ఖర్చు పెట్టా. తుఫాన్ దెబ్బకు పూర్తిగా దెబ్బతింది.

- మహిళా రైతు సుబ్బమ్మ, ఎర్రగుడి



కాయలు లేని కంది పంట

నేటి నుంచి సమ్మెలోకి ఇంజనీరింగ్ విభాగం కార్మికులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. 20 ఏళ్లుగా ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు జీతాలు పెంచాలని వారం రోజులుగా రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా అధికారులకు యూనియన్ నాయకులు వినతి పత్రాలు అందజేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. సోమవారం ఉదయం 10గంటలకు అశోక్‌నగర్‌లోని పంప్‌హౌస్ నుంచి నగర పాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిసింది. ఇందులో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పంప్‌హౌస్‌లో పని చేస్తున్న కార్మికులు, నగర పాలక కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, తాగునీరు సరఫరా చేసే సిబ్బంది, వీధి దీపాలు సంబంధించిన సిబ్బంది తదితర కార్మికులు పాల్గొంటున్నారు.

7వ జిల్లా స్థాయి ఉషూ పోటీలు ప్రారంభించిన టీజీవీ



మార్షల్ ఆర్ట్స్ క్రీడలను ప్రారంభిస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కిడ్స్ వరల్డ్ రోశయ్య కమ్యూనిటీ హాలులో ఆదివారం 7వ జిల్లా స్థాయి ఉషూ పోటీలు ప్రారంభమయ్యా యి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి మార్షల్ ఆర్ట్స్ ఉషూ క్రీడాకారులను ప్రోత్సహించాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలపై మక్కువ పెంచేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు మాట్లాడుతూ 300 మంది క్రీడాకారులు ఉషూ పోటీల్లో పాల్గొన్నారన్నారు. అండర్-12, 15, 18 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, రెఫ్రీలు సుధాకర్, చిన్న శ్రీ నివాసులు, అనుమతీశ్వర్, నాగ సులోచన, మధు, మేఘన, కార్యదర్శి టి.శ్రీనివాసుల పాల్గొన్నారు.

దద్దరిల్లిన జడ్పీ

(5వ పేజీ తరువాయి)

ఏ గ్రామంలో జరిగిందో చెబితే విచారణకు సిద్ధమని కోసిగి జడ్పీటీసీ పవిత్రా పాటిల్‌తో పాటు ఇతర జడ్పీటీసీ సభ్యులు ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. మీరు చేసిన అరాచకాల వల్లే ప్రజలు వైసీపీకి 11 సీట్లకే పరిమితం చేశారని నందికొట్కూరు ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ వ్యవస్థలకు వైసీపీ ప్రభుత్వం ఒక్క పైసా కూడా విడుదల చేయలేదన్నారు.

● బ్రాహ్మణకోట్కూరులో వైన్‌షాప్‌పై దుమారం

నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకోట్కూరు గ్రామంలోని జడ్పీ పాఠశాల వద్ద వైన్‌షాపు పెట్టడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని నందికొట్కూరు జడ్పీటీసీ సభ్యురాలు షేక్ కరీమున్నీసా సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇంతలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కలగజేసుకుని 'ఎందుకు ఇక్కడ మాట్లాడుతున్నావు.. ముందు కూర్చో..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో జడ్పీటీసీలు ఎమ్మెల్యేపై విరుచుకుపడ్డారు. బడి, గుడి వద్ద వైన్‌షాపులు పెట్టకూడదని నిబంధనలు ఉన్న ఎలా ఏర్పాటు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పిల్లలు గంజాయికి అలవాటుపడ్డారని ఎమ్మెల్యే అన్నారు. నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిబంధనలు ప్రకారమే అయితే పాఠశాల వద్ద ఎలా ఏర్పాటు చేస్తారని కోసిగి, దేవనకొండ, జడ్పీటీసీ సభ్యులు ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

● అభివృద్ధికి సహకరిస్తాం
- ఎర్రబోతుల పాపిరెడ్డి, జడ్పీ చైర్మన్



ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి సహకరిస్తాం. ఏదైనా తప్పు జరిగితే తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలకు ఆదేశిస్తాం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికే నిధులు విడుదల చేస్తున్నారు. గ్రామ,మండల స్థాయిలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. అధికారులు ఏ గ్రామానికి వెళ్లిన తప్పకుండా స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వండి.

● జేజేఎం గడువు పెంచాలి
- గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే



జలజీవన్ మిషన్ పథకం గడువు పెంచాలి. జేజేఎం కింద రూ.25 వేల కోట్లు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే వినియోగించింది. జేజేఎం మరో రెండేళ్లు గడువు పెంచితే అందరికి తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ఆర్అండ్ కింద ప్యాచ్ పనులు చేస్తున్నారు. అదే విధంగా పంచాయతీరాజ్ విభాగం అధ్వర్యంలో కూడ ప్యాచ్ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

● ఆస్పరి మండలంలో గతంలో నాతనహల్లి స్కీం కింద 15 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుందని, ప్రస్తుతం 15 గ్రామాలకు అక్రమంగా కనెక్షన్లు ఇవ్వడంతో ముందు గ్రామాలను నీరు రావడం లేదని జడ్పీటీసీ దొరబాబు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే విచారించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మహనంది మండలం గాజులపల్లె వద్ద బసాపురం గ్రామంలో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని జడ్పీటీసీ కోరారు. కొత్తపల్లి మండల పరిధిలో కొన్ని చోట్ల కరెంటు పోల్స్ వంగి ఉన్నాయని వాటిని మార్చాలని జడ్పీటీసీ అన్నారు. ఆర్థిక సంఘం నిధులపై బెళగల్ మండలం కొండాపూర్ గ్రామంలో అవినీతి జరిగిందని తక్షణమే విచారణ జరిపించాలని కోరారు. హలహర్విలో ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది తక్షణమే నూతనంగా నిర్మించాలని జడ్పీటీసీ కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ చల్లాకళ్యాణి, జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కురువ కార్పొరేషన్ చైర్మన్ నాగేంద్రప్ప, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



కోసిగి జడ్పీటీసీ సభ్యురాలితో ఎమ్మెల్యే జయసూర్య వాగ్వాదం



జడ్పీ సమావేశానికి హాజరైన జడ్పీటీసీ సభ్యులు

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

- 459 మంది సిబ్బందితో ఈగల్ టీమ్
- ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన సదస్సులు
- తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలి
- ఈగల్ అధిపతి ఐజీ ఆకే రవికృష్ణ

కర్నూలు క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయడమే (ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఈగల్ ముందున్న లక్ష్యమని ఈగల్ అధిపతి ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. కప్పట్రాళ్ల పర్యటనలో భాగంగా కర్నూలు వచ్చిన ఆయనతో ఆంధ్రజ్యోతితో ఈగల్ టీం లక్ష్యాలను పంచుకున్నారు. ఏపీలో ముఖ్యంగా విద్యార్థులు మత్తుకు బానిస కాకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. ఆ దిశగా పాఠశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తున్నాయని అలాంటి సప్లయ్ చేసేవారితో పాటు తీసుకున్న వారు కూడా నేరస్థులేనని పేర్కొన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని సూచించారు.

● ప్రశ్న: ఈగల్ టీమ్ ఎలా పని చేస్తుంది..?

● ఈగల్ చీఫ్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈగల్ టీమ్ ఏర్పాటైంది. 459 మంది సిబ్బందితో ఈగల్ టీమ్ పని చేస్తుంది. అన్ని జిల్లాలో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఇద్దరు ఎస్పీలు, ఇద్దరు అడిషినల్ ఎస్పీలు, ఆరు మంది డీఎస్పీల ఆధ్వర్యంలో రాష్ట్ర హెడ్ క్వార్టర్‌లో ఈ టీమ్ ఉంటుంది. డేటా ఎనాలసిస్, టెక్నికల్ ఎనాలసిస్ అంశాలతో ప్రత్యేకంగా రూపొందించారు. ప్రతి జిల్లాకు ఒక టీం సిబ్బంది ఏర్పాటు చేస్తున్నాం. తీవ్రమైన కేసుల్లో ఈగల్ మెయిన్ టీమ్ కోఆర్డినేషన్ చేస్తుంది.

● ప్రశ్న: ఇతర రాష్ట్రాలతో ఎలా సమన్వయం చేసుకుంటున్నారు

● ఈగల్ చీఫ్: ముఖ్యంగా గంజాయి ఎక్కువగా ఉండే ఒడిస్సా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతో సమన్వయం చేసుకున్నాం. ఆయా రాష్ట్రాల్లో ఉన్న సరిహద్దులోని ఎస్పీలు నేరుగా కోఆర్డినేషన్ చేసుకుంటారు. కోరాపూర్, మల్కన్‌గిరి, గంజామ్, రాయ్‌ఘడ్ జిల్లాల ఎస్పీలతో ఇప్పటికే చర్చించాం. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం, మన్యం జిల్లాల ఎస్పీలు కూడా సరిహద్దు రాష్ట్రాల ఎస్పీలతో ఒక టీమ్‌గా ఏర్పడ్డారు. ఇప్పటికే పంజాబ్ ఏఎన్‌టీఎఫ్‌తో చర్చించాం. అక్కడ వారు అవలంబిస్తున్న విధానాలను స్టడీ చేశాం. ముఖ్యంగా ఎస్‌టీడీడీ (సోర్స్, ట్రాన్స్‌పోర్టేషన్, డెస్టినేషన్, డిమాండ్)పై దృష్టి సారించాం. ఎక్కడైతే.. గంజాయి, డ్రగ్స్ సప్లయ్ తయారు చేస్తున్నారో అక్కడ తనిఖీలు చేస్తాం. ఆ తర్వాత ఏయే మార్గాల ద్వారా రవాణా జరుగుతుందో గుర్తించే ప్రణాళికలు రూపొందించుకుంటాం. ఆ తర్వాత మత్తు పదార్థాలు సరఫరా అయ్యే చివరి ప్రాంతాలు కూడా గుర్తించేందుకు మా టీములు రంగంలో దిగుతాయి.

● ప్రశ్న: డ్రగ్స్ వాడే వారిపై ఎలాంటి చట్టాలు ఉన్నాయి..?

● ఈగల్ చీఫ్: డ్రగ్స్ సప్లయ్ చేసినా, వాడినా ఇద్దరూ నేరస్థులే. ఎన్‌డీపీఎస్ చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడితే గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు శిక్ష ఉంటుంది. ఇతర కేసుల్లో కేసు నిరూపించాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉంటుంది. ఈ డ్రగ్స్ కేసులు నిరూపించుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉంటుంది కాబట్టి చాలా ఇబ్బందులు పడుతారు. కేసుల్లో బెయిల్ కూడా దొరకదు. డ్రగ్స్ తీసుకున్న వారిపై కూడా కేసులు నమోదవుతాయి. అలాగే అమ్మినవారు, కొన్నవారి పేర్లను సెంట్రల్ గవర్నమెంటు రూపొందించిన నిధాన్ పోర్టల్‌లో నమోదవుతాయి. భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

● ప్రశ్న: ఎలాంటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్నారు..?

● ఈగల్ చీఫ్: డ్రగ్స్ విద్యాసంస్థల్లోకి వెళ్లకూడదన్నది ప్రభుత్వం ప్రధాన లక్ష్యం. అన్ని విద్యాసంస్థల్లో యాంటి డ్రగ్స్ కమిటీని నియమిస్తున్నాం. పది మంది విద్యార్థులు ఒక అధ్యాపకుడు ఇందులో ఉంటారు. అలాగే 43 వేల పాఠశాలల్లో 1.30 కోటి మంది విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టింది. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న డీ-అడిక్షన్ సెంటర్లతో కోఆర్డినేషన్ చేసుకుంటున్నాం. వారితో కూడా సమావేశాలు నిర్వహిస్తున్నాం.

● ప్రశ్న: తల్లిదండ్రులకు మీరు ఇచ్చే సూచనలు..

● ఈగల్ చీఫ్: తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. వారానికి ఒకసారైన వారి పుస్తకాలు, బ్యాగులు తనిఖీలు చేయాలి. ఏదైనా అనుమానం వస్తే ప్రశ్నించాలి. మీ ఇంట్లోకి డ్రగ్స్ రాకూడదనే కృతనిశ్చయంతో ఉండాలి. పిల్లలు ఎక్కడికెక్కడికి వెళ్తున్నారు.. ఒంటరిగా ఉంటున్నారనే విషయాలను కూడా గమనించాలి.



● ప్రశ్న: టోల్‌ఫ్రీ నెంబర్ చెప్పండి

● ఈగల్ చీఫ్: ఈగల్ టోల్‌ఫ్రీ నెంబర్ 1972ను ఏర్పాటు చేశాం. ఎవరైనా బాధితులు తమ బాధను ఈ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చు. అలాగే డ్రగ్స్ సరఫరా వంటి వివరాలు వెల్లడించవచ్చు. ఇటీవల ఓ తల్లి 1972కు ఫోన్ చేసి వారి కూతురు డ్రగ్స్‌కు అలవాటు పడిందని సమాచారం ఇవ్వడంతో ఆ అమ్మాయిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించేందుకు చర్యలు తీసుకున్నాం.

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగట్ల గ్రామంలో తమ్ముడి కుటుంబంపై దాడి చేసిన ఘటనలో అన్న కుటుంబానికి చెందిన నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నల్లగట్లకు చెందిన అన్నదమ్ముళ్లు వెంకట రమణ, నాగరాజుల మధ్య కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదంతో అన్న వెంకటరమణ తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం రాత్రి తమ్ముడు నాగరాజు కుటుంబసభ్యులైన హేమలత, మాధవపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. క్షతగాత్రులు నంద్యాలలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ ఘటనలో బాధితుడు మాధవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటరమణ, మల్లేశ్వరి, సాయి, మద్దిలేటి లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు

కర్నూలు క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ డ్రింకింగ్ చేసే వారిపై పోలీసులు డ్రోన్‌తో కొరడా ఝుళిపించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో నాలుగో పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేశారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, నాలుగో పట్టణ ఎస్ఐ గోపినాథ్, ఆర్ఎస్ఐ హుశేన్‌లు శరీన్‌నగర్, వక్కెర వాగు, ఆర్టీసీ బస్టాండు వంటి పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నట్లు 19 మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు



కర్ణాటక రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామికి మెమెంటో ఇస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని ఆదివారం ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి, ఏపీ హైకోర్టు జడ్జిలు జస్టిస్ న్యాపతి విజయ్, జస్టిస్ మహేశ్వరరావు కుంచెం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శ్రీమఠం మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తిలు వీరికి ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట మఠం సిబ్బంది అనంతపురాణిక్, జేపీ స్వామి, ఎస్ఐ పరమేష్ నాయక్, వ్యాసరాజాచార్,దేశాయి నరసింహ ఆచార్, ప్రకాష్ ఆచార్,రంగస్వామి, జయతీర్థ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరం.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్యాపిలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1998-99 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. బెంగుళూరు, హైదరాబాద్ వివిధ ప్రాంతాల్లో, ఆయా వృత్తులలో స్థిరపడిన దాదాపు 70 మందికి పైగా పూర్వ విద్యార్థులు 26సంవత్సరాల తర్వాత కలుసు కోవడంతో ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకుం టూ పరవసించి పోయారు. ఆలింగనం చేసుకొని ఆనంద బాష్పాలు రాల్చారు. ఈ మధుర క్షణం తీపిగుర్తుగా స్నేహితులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం చదువు చెప్పిన గురువులకు సన్మానం చేశారు.



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వ్యక్తి ఆత్మహత్య

పగిడ్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో రామంజనేయులు(35) అనే వ్యక్తి ఆదివారం ఉరి ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామానికి చెందిన రామంజనేయులు గ్రామంలో పొలం పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. రామంజనేయులు ఆదివారం ఇంట్లో ఉరివేసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు సమాచారాన్ని పోలీస్‌లకు తెలియజేయడంతో ముచ్చుమర్రి ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామంజనేయులు భార్య అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది

వలస కూలీ ఇంట్లో చోరీ

- కూతురు పెళ్లి కోసం దాచిన బంగారం అపహరణ
- ఆలస్యంగా వెలుగులోకి..

గోనెగండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని కురువ వీధిలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. గత బుధవారం జరిగిన ఈ ఘటనలో దొంగలు రెండు తులాల బంగారం తీసుకెళ్లారు. వివరాలు ఇలా.. బాధితులు పులకుర్తి రంగస్వామి, ఈరమ్మలు వలస వెళ్లి జీవనం సాగించేవారు. వారికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కూతురుకు పెళ్లి కోసం కూడబెట్టుకున్న డబ్బుతో రెండు తులాల బంగారు కొని ఇంట్లోని బీరువాలో దాచి ఉంచారు. గత నెల 22వ తేదీన తెలంగాణలోని నల్గొండ జిల్లాకు వలసపోయారు. అయితే ఈ నెల ఐదో తేదీన రంగస్వామి అన్న చోరీ తమ్ముని ఇంట్లో చోరీ జరిగిందని తెలుసుకున్నాడు. తమ్ముడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో రంగస్వామి నల్గొండ నుంచి వచ్చి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.



బీరువాను పగల గొట్టిన దొంగలు

సీసీ రోడ్లకు మోక్షమెన్నడో?

● మధ్యలోనే నిలిచిపోయిన పనులు ● పలు గ్రామాల్లో ఇప్పటికీ మట్టి రోడ్లే గతి ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామంలో మట్టిరోడ్డు







పాములపాడు మండలం మిట్టకందాల మజరా గ్రామం బుద్ధనగర్‌లో, కొత్తపల్లె మండలంలోని చిన్న గుమ్మడాపురంలో, నందికొట్కూరులోని మారుతీ నగర్ కాలనీలో కంకరవేసి వదిలేసిన రోడ్లు

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వైసీపీ హయాంలో సీసీ రోడ్ల నిర్మాణంలో భాగంగా తూతూ మంత్రంగా వీధుల్లో కంకర వేసి ఎంతో హడావిడి చేసి అలాగే వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు కంరలో నడవలేక ఇబ్బందులకు గురవుతున్నారు. కంకర వేసిన వీధుల్లో కనీసం టూవీలర్లు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. వర్షం వస్తే మరీ ఇబ్బందిగా ఉంది. మరికొన్ని గ్రామాల్లో ఇప్పటికీ కనీసం సీసీ రోడ్డు లేని కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీల్లో వర్షం వస్తే చాలు వీధులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 5 సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా గంతలు పడిన రహదారులే దర్శనమిచ్చాయి. అయితే కూటమి ప్రభుత్వం స్పందించి సీసీ రోడ్లను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నందికొట్కూరు పట్టణంలోని శేషశయనారెడ్డినగరలో కేజీ రహదారి ప్రక్కనే నాలుగు వీధులలో కంకరవేసి వదిలేశారు. అలాగే బైరెడ్డి నగర్‌లో, మారుతీ నగర్ కాలనీలో వైసీపీ హయాంలో రోడ్లకు కంకరవేసి వదిలేశారు.

కొత్తపల్లె మండలంలోని చిన్న గుమ్మడాపురం గ్రామం అంచె వద్ద బస్ షెల్టర్ నుంచి గుమ్మడాపురం వెళ్లే రహదిలో దాదాపుగా ఒక కిలోమీటర్ రోడ్డుకు కంకర వేసి వదిలేశారు. అలాగే ఎం.లింగాపురం గ్రామంలో ప్రధాన రహదారి ఎన్నో ఏళ్లుగా వంకను తలపిస్తోంది. ఈ రహదారి వెంబడే దాదాపుగా ఆరు గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పాములపాడు మండలంలోని మిట్టకందాల గ్రామానికి మజారా గ్రామంగా ఎన్న బుద్దనగర్‌లో కూడా కంకర పరిచి వదిలేశారు.

ఇదిలా వుండగా ప్రస్తుతం 340 సీ జాతీయ రహదిరి పనులు జరుగుతున్న నేపథ్యంలో రహదారి పనుల కోసం ఎర్ర మట్టి తరలింపులో ఈ గ్రామలాలలో వందల సంఖ్యలో ట్రిప్పర్లు హైలోడ్ తో తిరుగుతుడండంతో ఉన్న రోడ్లు కూడా భారీగా గుంతలు పడి దెబ్బతింటున్నాయి. ఈ జాతీయ రహదారి పుణ్యమా అంటూ గ్రామాల పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. హైవే అధికారులతో ఉన్నత స్థాయి నాయకులు మాట్లాడి వారి వాహణాలు తిరిగిన గ్రామాల్లో కనీసం గుంతలను పూడ్చించే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జూపాడుబంగ్లా మండలంలోని తంగేడంచ గ్రామంలో ఇప్పటికీ బీసీ కాలనీలో కనీసం సీసీ రోడ్డు లేక 70 సంవత్సరాలు కావస్తోంది. ఏ ప్రభుత్వం వచ్చినా పట్టించు కోవడంలేదని కాలనీ వాసులు ఎంతో ఆవేదనకు గురవుతున్నారు. వర్షం వచ్చిందటే చాలు ఈ కాలనీ చెరువును తలపిస్తోంది. ఒక అడుగున్నర లోతు బరద నీటిలో నడవాల్సిందే.

ఈ నెలలోపు పూర్తయ్యేలా చర్యలు

ఈ రోడ్లకు ఏఐబీ కింద నిధులు మంజూరయ్యాయి. ఈ నెల చివరి కల్లా రోడ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్లకు పనులు పూర్తి చేస్తే బిల్లులు వస్తాయి. ప్రస్తుత కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకపోతే ఇతరులకు అప్పగిస్తాం.

- రామ్మోహన్, పీఐయూ డీఈ, నందికొట్కూరు

'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి: ఏఈ

నంద్యాల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని పట్టణ, గ్రామీణ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల పట్టణ డీ2 సెక్షన్ ఏఈ రామయ్య సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇళ్ల పైకప్పులపై సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ఆదాతో పాటు బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. వంద చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని, దీంతో నెలకు 130 యూనిట్ల ఉత్పత్తి అవుతుందని చెప్పారు. రూ.60 వేల నుంచి 70 వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 30 వేలు రాయితీ ఇస్తుందని చెప్పారు. సోలార్ ఏర్పాటుతో నెలకు 1000 వచ్చే విద్యుత్ బిల్లు కేవలం రూ.338 బిల్లు మాత్రమే వస్తుందన్నారు. అలాగే 2 కిలోవాట్ ఏర్పాటుకు రూ.1.40 లక్షల మేరకు ఖర్చు వస్తుందని కేంద్రం రూ.60 వేలు రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. సోలార్ ఏర్పాటుకు బ్యాంక్ ద్వారా రుణం పొందే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించిదన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వినియోగించుకోగా మిగిలితే విద్యుత్‌ను విద్యుత్‌శాఖనే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. నంద్యాల పట్టణంలో ఇప్పటి వరకు 150 సోలార్లను అమర్చినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విళక్కి పూజ



హోమంలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి వారికి 45వ మండల విళక్కి మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం హోమాలు, మహా పూర్ణాహుతి, పుష్పయాగం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమాజం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

14న దత్త జయంతి

ఆత్మకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులోని షిర్డీ సాయి బాబా ఆలయంలో ఈనెల 14న దత్తజయంతి వేడుకలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని రకాలు చర్యలు చేపట్టింది. 14న ఉదయం 6గంటలకు కాకడ హారతి, 7.30గంటలకు దత్త అంశమైన శ్రీషిర్డీ సాయినాథుడికి నవవిధ అభిషేకాలు, పుష్పార్చన నిర్వహించబడను. 8.30గంటలకు దత్తాత్రేయ స్వామి ప్రదక్షిణలు, 10.30గంటలకు సాయిసత్య వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. మధ్యాహ్నం, సాయంకాల వేళల్లో హారతులతో స్వామివారికి పూజా కార్యక్రమాలు జరుపనున్నారు. అలాగే రాత్రి 7గంటల నుంచి 8.30గంటల వరకు సాయిబాబా భజన మండలి వారిచే భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాత్రి 8.45గంటలకు పల్లకిసేవ, 9.00గంటలకు శేజాహారతితో పాటు మహా మంగళహారతి నివేదించనున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఆదివారం లోకకళ్యాణార్థం స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వ చన మండపంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేసి పల్లకీలో ఆసీనులను జేసి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

జాయింట్ సెక్రటరీగా శివ

నంద్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నంద్యాలకు చెందిన బెస్త పుట్టా శివ ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం నంద్యాలలో పుట్టా శివ మాట్లాడుతూ గతంలో బెస్తల అభివృద్ధికి కృషి చేయడంపై తనను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారన్నారు.

'రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి'

కొత్తపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఉద్యాన పంటలైన మామిడి, ఉల్లికి వాతావరణ ఆధారిత బీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించాలని ఉద్యానవన శాఖ అధికారి కె.చందన తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఉద్యాన వన పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు పంట నష్టం జరిగినప్పుడు పరిహారం పొందేందుకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల పంట నష్టం జరిగితే కేంద్ర ప్రభుత్వం అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి ద్వారా వాతావరణ ఆధారిత ఉద్యాన పంటలకు బీమాను అందిస్తుందన్నారు. ఇందు కోసం మామిడికి ఎకరాకు రూ.2250 చెల్లిస్తే రూ.45 వేలు, ఉల్లి పంటకు ఎకరాకు రూ.90 ప్రీమియం చెల్లిస్తే రూ.45 వేలు బీమా వర్తింపజేస్తుందని తెలిపారు. ఈ ప్రీమియం మొత్తాన్ని ఈ నెల 15వ తేదీలోపు రైతులు బ్యాంకు కామన్ సర్వీస్ సెంటర్, మీసేవా, బీమా కంపెనీ నియమించిన మధ్యవర్తుల ద్వారా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. రైతులు కూడా నేరుగా పీఎంఎఫ్‌బీవై పోర్టల్‌లో ఫోన్ నెంబరు ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల పద్మావతీ నగర్‌లో వెలసిన శ్రీకృష్ణమందిరంలో సోమవారం ఉదయం 9 గంటలకు సంపూర్ణ మద్భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు పార్థసారధికృష్ణ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6,7,8,9 తరగతుల విద్యార్థులకు, 18 సంవత్సరాలలోపు వయస్సు వారికి, 18ఏళ్ల పైబడిన వారికి వేర్వేరుగా పోటీలు ఉంటాయని చెప్పారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్



ముచ్చుమర్రి పోలీసు స్టేషన్‌లో రికార్డును పరిశీలిస్తున్న డీఎస్పీ

పగిడ్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ హెచ్చరించారు. మండలంలోని ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను, కేసుల వివరాలను ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని ప్రజలను ఇబ్బందులకు గురిచేసే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారికి తక్షణమే న్యాయం చేయాలని, కేసుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో బెల్టుషాపులు, సారా విక్రయాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు చేస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ వెంట నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.

'టీడీపీ సభ్యత్వంతో భరోసా'



టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

పాణ్యం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో వర్తించే భీమా సౌకర్యంతో జీవితాలకు భరోసా లభిస్తుందని టీడీపీ జిల్లా ముస్లిం మైనార్టీ కార్యవర్గ సభ్యుడు ఖాదర్‌బాషా తెలిపారు. ఆదివారం గోరుకల్లు తండాలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. తండాలోని గిరిజనులతో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహబూబ్‌బాషా, సుబ్బయ్య గిరిజనులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు, ఇతర వస్తువులను

నందికొట్కూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శికారిపేటలోని నాటుసారా స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 31 ప్లాస్టిక్ డ్రమ్ములలో ఉన్న 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి డ్రమ్ములను పగులగొట్టారు. 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని సికారీ లాజీ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నాటు సారా వండటం, అమ్మటం నేరమని, సారా తాగడం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. కావున సికారిపేటలోని వ్యక్తులు సారాయి తయారీకి స్వస్తి పలకాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు చంద్రశేఖర్, సురేష్‌బాబు, మిడ్తూరు ఎస్ఐ ఓబులేసు, నందికొట్కూరు పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విశ్రాంత సైనికుల సమస్యలపై పోరాటం'



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

నంద్యాల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత సైనిక ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని విశ్రాంత సైనిక ఉద్యోగుల అసోసియేషన్ నంద్యాల డివిజన్ కమిటీ నూతన అధ్యక్షుడు చిన్న రంగనాయకులు అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని మాజీ సైనిక ఉద్యోగుల కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ సంతోష్ నేతృత్వంలో కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో ప్రభుదాస్ ప్యానెల్‌పై చిన్న రంగనాయకులు ప్యానెల్ విజయం సాధించింది. అధ్యక్షుడిగా చిన్నరంగనాయకులు, ఉపాధ్యక్షుడిగా రామరాజు, కార్యదర్శిగా గురువయ్య, ట్రెజరర్‌గా జయరావు ఎన్నికయ్యారు. అనంతరం చిన్నరంగనాయకులు మాట్లాడుతూ నంద్యాలలో మిలిటరీ క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

'దూదేకులు అన్ని రంగాల్లో రాణించాలి'



మాట్లాడుతున్న షేక్ సత్తార్ సాహెబ్

ఆత్మకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దూదేకుల కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు షేక్ సత్తార్ సాహెబ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు నందు దూదేకుల ఆత్మకూరు తాలుకా కమిటీని ఎన్నుకున్నారు. షేక్ సత్తార్ సాహెబ్ మాట్లాడుతూ దూదేకుల కులస్తులందరూ ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని సూచించారు. ప్రభుత్వాల దూదేకుల అభ్యున్నతికి తోడ్పాటునందించాలని కోరారు. అన్ని రంగాల్లో వెనకబడిన దూదేకుల కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పీరుసాహేబ్, కోకన్వీనర్లుగా మాలిక్, ఖాజాహుసేన్, మౌలాలి, శాలుబాషా, టైలర్ హుసేన్, మల్లస్వామి, అబ్దుల్ రహిమాన్, పెద్దస్వామిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని ఆ కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్, ఉద్యోగ సంఘం నాయకులు మస్తానయ్య తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

● అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ కార్మికుల వినతి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

నందికొట్కూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ ఆదివారం మున్సిపల్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకుడు సర్వర్ ఖాన్, పరమేష్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 36 ప్రకారం పారిశుధ్య కార్మికులకు అందజేస్తున్న వేతనం ప్రకారం ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న కార్మికులకు కూడా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పరమేష్, శివ సుబ్బయ్య, చాంద్‌బాషా, నాగరాజు, శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, శ్రీరాములు, ఇబ్రహీం, మస్తాన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళాలు

శ్రీశైలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన ఎస్ఎల్ నరసింహమూర్తి అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,01,116 ల విరాళాన్ని అందించారు. నల్గొండకు చెందిన ఎస్.నారాయణ వర్మ అనే భక్తుడు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.





భక్తులకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకురాలు హిమబిందు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రహదారిపై మురుగు నీరు



చాగలమర్రిలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

చాగలమర్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత పోస్టాఫీసు సమీపంలోగల రహదారి నీటి కుంటను తలపిస్తోంది. రహదారిపై మురుగు నీరు ప్రవహించి దుర్గంధం వెదజల్లుతోంది. ఆ దారి వెంట నడవాలంటే ముక్కున వేలు వేసుకొని నడవాల్సిందే. ట్యాంకులు, కొళాయిల నీరు వృథాతో పాటు మురికి నీరు కలిసి రహదారిపై ప్రవహిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగైతే రోగాలు రావా అంటూ పలువురు వాపోతున్నారు. మురికి కాలువలు లేకపోవడంతో నిత్యం మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి మురుగు నీరు పోయేలా కాలువలు ఏర్పాటు చేయాలని, రహదారి మరమ్మతులు చేపట్టాలని, వ్యాధులు రాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ముళ్ల కంపల తొలగింపు



గొడిగనూరులో ఎక్స్‌కవేటర్‌తో ముళ్ల కంపలను తొలగిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో టీడీపీ నాయకుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం సమీపంలోని ముళ్ల కంపలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అలాగే పలు రహదారుల్లో ముళ్ల కంపలను, చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నారు.

12న మెగా జాబ్ మేళా

బనగానపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని నెహ్రూ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12న మెగా జాబ్‌మేళాను రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీయువకుల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 30 కంపెనీలు పాల్గొనున్నట్లు వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, బీసీఏ, బీటెక్, ఐటీఐ పూర్తి చేసిన 18 సంవత్సరాలనుంచి 30ఏళ్ల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు మంత్రి కార్యాలయాన్ని లేదా 9603232977 నంబరును సంప్రదించాలన్నారు. ప్రతి అభ్యర్థి రిజ్యూమ్, జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలన్నారు.

నిత్యం దైవాన్ని ప్రార్థించాలి

రుద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిత్యం దైవాన్ని ప్రార్థించాలని ఆటో యాత్రికుడు అబ్దుల్ గఫార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఆటో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవాన్ని స్మరిస్తూ, ప్రార్థిస్తూ జీవితాన్ని గడపాలన్నారు. ఇలా చేస్తే జీవితమంతా శాంతిగా ఉంటుందని ఆయన అన్నారు.

వీరాంజనేయ స్వామికి విశేష పూజలు



వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని గాంధీబజార్‌లో వెలసిన వీరాంజనేయస్వామికి వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు జల, పాలాభిషేకాలు చేశారు. సామూహికంగా ఆంజ నేయస్వామి వ్రతం, భజన కార్యక్రమాలు చేశారు. మూడురాళ్లపల్లె రహదా రిలోని అభయాంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గంగపుత్రుల నూతన కమిటీ ఎన్నిక

డోన్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డోన్ తాలుకా గంగపుత్రుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గంగపుత్రుల సంఘం కమిటీ గౌరవాధ్యక్షుడిగా ప్రజావైద్యశాల మల్లికార్జున, అధ్యక్షుడిగా కొచ్చెర్వు గోపాల్, ఉపాధ్యక్షులుగా చీనికాయల వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శిగా నేరెడుచెర్ల సాంబశివుడు, సహాయ కార్యదర్శిగా గోసానిపల్లె మాధవస్వామి, కోశాధికారిగా శివుడు, న్యాయ సలహాదారుడుగా చంద్రుడుల ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, సప్తశైల సతీష్, ఎంజీ మల్లికార్జున, గోసానిపల్లె మాజీ సర్పంచ్ శ్రీరాములు, మల్కాపురం గౌరి శివయ్య, బావిపల్లె రంగారావు, కనపకుంట గంగపుత్రుల సంఘం మాజీ అధ్యక్షులు టి.వెంకటేశ్వర్లు, మాజీ సెక్రటరీ ఎండీ రవికుమార్, మాదారం సోమయ్య, సిద్దన్నగట్టు ఓబులేసు, ఎల్ఐసీ శ్రీరాములు, డాబా సూరీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన వీధులు బురదమయం



బురదమయంగా మారిన బస్టాండు సర్కిల్

అవుకు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాశీపురం గ్రామంలో వీధులు బురద మయంగా మారాయి. గ్రామంలోని ప్రజలు ఇళ్ల బయట ఉన్న కొళాయిలను తిప్పి ఉంచటం, ఇళ్లల్లోని వేస్టేజి వాటర్‌ను రోడ్లపైన పారబోయటంతో వీధులు పరిశుభ్రంగా మారి దుర్వాసన వెదల్లుతోంది. ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉన్నది. పట్టించుకోవాల్సిన వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు నీటిని రోడ్లపై పోయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వెలగటూరులో కల్తీ జొన్నల కేంద్రం

- తెల్లజొన్నలను పచ్చజొన్నలుగా మారుస్తున్న వైనం
- వైసీపీ చోటా నాయకుల కనుసన్నల్లో వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

కోవెలకుంట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో కల్తీది కాదంటూ ఏది లేదు. వాడే వస్తువుల నుంచి తినే తిండి వరకు అన్ని కల్తీనే. చివరకు రైతులు పండించిన ధాన్యాన్ని కూడా కల్తీ చేస్తూ కొందరు ఘనులు సొమ్ము చేసుకుంటున్నారు. కోవెలకుంట్ల మండల పరిధిలోని వెలగటూరు గ్రామంలో రోడ్డు పక్కనే కొన్నేళ్లుగా రెండు రేకుల షెడ్లు ఏర్పాటు చేసి కల్తీ జొన్నల తయారీకి కొందరు వైసీపీ చోటా నాయకులు తెరలేపారు. ఇక్కడి నుంచి కర్ణాటక, చెన్నై, హైదరాబాదు, బెంగుళూరు వంటి పట్టణాలకు కల్తీ జొన్నలు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

కల్తీ జొన్నల తయారీ ఇలా..

రైతుల వద్ద నుంచి మహేంద్ర, హైటెక్ తెల్లజొన్నలు తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. వీటిని కేంద్రాన్ని తరలించి కుప్పలుగా పోసి కొంత మంది కూలీలతో పేడనీటిలో కలిపే రంగు (ఇంటి ముందు కల్లాపు చల్లే రంగు) నీటితో కలుపుతారు. అంతా కలియబెట్టి పచ్చగా రంగు మారే విధంగా చేసి కొన్ని గంటలు ఆరబెట్టుతారు. అనంతరం సంచులకు ఎత్తి ఇతర పట్టణాలకు తరలించి అధిక రేటుకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.



వెలగటూరులో తయారు చేసిన కల్తీ జొన్నలను లోడు చేస్తున్న దృశ్యం

ప్రజాప్రతినిధుల సహకారం?

కోవెలకుంట్ల పట్టణానికి రెండు కి.మీ దూరంలో కల్తీ జొన్నల కేంద్రం ఉన్నప్పటికీ ఇటువైపు వ్యవసాయాధికారులు కానీ, ఇతర అధికారులు కానీ చుట్టపుచూపుగా అయినా కూడా చూడకపోవడం విచారకరం. స్థానికులు ఇద్దరు వైసీపీ చోటా నాయకులు, ప్రజాప్రతినిధుల అండదండలతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా మల్చుకున్నారు. వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తోంది. వెలగటూరులో జరుగుతున్న కల్తీ జొన్నల కేంద్రంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో రాణించాలి

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీసుధ హై స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి లగోరి చాంపియన్‌షిప్ పోటీలకు మాజీ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆమె బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీసుధ హై స్కూల్ యజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బేతంచెర్లకు రాక..

బేతంచెర్ల: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగే టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరుకానున్నట్లు టీడీపీ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఉదయం 10 గంటలకు బేతంచెర్లకు రానున్నారని, కౌన్సిలర్లు, బూత్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి మండలంలోని ఆయా టీడీపీ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కోట్ల సుజాతమ్మ

టీడీపీతోనే పేదలకు సంక్షేమం



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

చాగలమర్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీల నిధులను దుర్వినియోగం చేశారని అన్నారు. కార్పొరేషన్లు, బ్యాంకుల ద్వారా రుణ సాయం అందించడంలో విఫలమయ్యారని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పేదలకు పింఛన్‌లను పంపిణీ చేసి భరోసా కల్పించారని అన్నారు. మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేశారని అన్నారు. రాబోయే రోజుల్లో సూపర్-6 పథకాలను అమలు చేయడం తథ్యమని అన్నారు. బీసీల సంక్షేమానికి అసెంబ్లీలో రూ.100 కోట్లు బడ్జెట్ కూడా కేటాయించారని అన్నారు. ఆదరణ పనిముట్లు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, పుల్లయ్య, సిద్ధప్ప, చిన్నికృష్ణయ్య, లాలయ్య, రమణయ్య, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు

దొర్నిపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండాపురం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామాల్లో మట్కా, పేకాట, జూదం, అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చిన్నచిన్న విషయాలకు ఘర్షణ పడి స్టేషన్‌ల చుట్టూ తిరిగి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సమస్యను తమ దృష్టికి తెస్తే సామరస్యంగా పరిష్కరిస్తామని అన్నారు. ప్రజలు ఐకమత్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన సిమెంటునగర్ గ్రామానికి చెందిన చాకలి మధు (29) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందా డని హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ ఆదివారం తెలిపారు. ఈనెల 1న గ్రామానికి చెందిన మధు సుంకులమ్మ గుడి దగ్గరకు వెళ్తుండగా.. రామనాథ అనే వ్యక్తి బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొన్నాడు. గాయపడిన మధును ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక కర్నూలు ప్రభుత్వ ఆసు పత్రిలో మృతి చెందాడన్నా రు. మధు తండ్రి చాకలి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అధ్వానంగా రాచెర్ల-మునిమడుగు రోడ్డు



రాళ్లు తేలిన రాచెర్ల-మునిమడుగు రహదారి

ప్యాపిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచెర్ల నుంచి మునిమడుగుకు వెళ్లే రహదారి పూర్తి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై రాళ్లు తేలి ప్రమాదకరంగా తయారైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాచెర్ల నుంచి మునిమడుగు రోడ్డు 6కి.మీ. దూరం ఉంది. మునిమడుగు నుంచి నిత్యం 20 మందికిపైగా విద్యార్థులు కాలినడకన, సైకిళ్లపై రాచెర్ల హైస్కూలుకు వెళ్తుంటారు. అలాగే అయా గ్రామాల ప్రజలు, రైతులు ఈ రోడ్డుపైన రాకపోకలు సాగిస్తుంటారు. అయితే దశాబ్దాలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో రోడ్డును బాగు చేస్తామని హామీలు గుప్పించిన నాయకులు అనంతరం తమ హామీలను విస్మరిస్తున్నారని రాచెర్ల, మునిముడుగు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన రోడ్డును అభివృద్ధి చేసి రవాణ సౌఖర్యాలను మెరుగు పరచాలని విద్యార్థులు, రైతులు కోరుతున్నారు.

14న గురుదత్త జయంతి వేడుకలు



అవుకులో వెలసిన షిరిడీ సాయినాథుడు

అవుకు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణంలో వెలసిన షిరిడీ సాయినాథుడి ఆలయంలో ఈనెల 14న గురుదత్త జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు సాయి సేవా సమితి కమిటీ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సేవా సమితి కమిటి వారు మాట్లాడుతూ 14న ఉదయం 5-15 గంటలకు స్వాముల వారికి కాగడ హారతి, క్షీర, శుద్ధోదక అభిషేకాలు, అలంకరణ, 8 గంటలకు ఆలయం నుంచి చెక్కభజన కోలాటాల మధ్య సాయినాథుడి గ్రామోత్సవం, 12 గంటలకు మధ్యాహ్న హారతి, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు సంధ్యాహారతి , 6-45 గంటలకు పల్లకిసేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లింగమయ్యకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

మండలంలోని చిన్నకంబలూరు, రుద్రవరం గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ మారెమ్మ సుంకులమ్మ అమ్మవార్లకు చీరలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలను పూజిస్తే పాడి పంట చల్లగా ఉంటుందని మహిళా భక్తులు నమ్మకం వ్యక్తం చేశారు.

టీడీపీ నాయకుడి మాతృమూర్తి మృతికి సంతాపం



నివాళి అర్పిస్తున్న గౌతమ్ కుమార్ రెడ్డి

డోన్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిగురుమానుపేటకు చెందిన టీడీపీ నాయకులు పెద్దకాంతు, చిన్నకాంతుల తల్లి మృతికి టీడీపీ డోన్ నాయకుడు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హమ్మయ్య.. ఆరబెట్టుకుంటాం

- ధాన్యం ఎండబెట్టే పనుల్లో రైతులు నిమగ్నం

చాగలమర్రి/రుద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి, రుద్రవరం మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు వరి కోసి, ధాన్యం ఆరబెట్టే పనుల్లో ఆదివారం నిమగ్నమయ్యారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో అన్నదాతలు కంటికి కునుకు లేకుండా కుదేలయ్యారు. కోత కోసి నూర్పిడి చేసిన ధాన్యం ఆరబెట్టుకొని పట్టలు కప్పుకున్న ధాన్యరాశులు తడిచి పోయాయి. ధాన్యం తడిచి పోవడంతో రైతులు రహదారులు, కలాల్లో ఎండబెట్టారు. కొందరు రైతులు ఎండిన ధాన్యం విక్రయించేందుకు సిద్ధం చేశారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



చిన్నకంబలూరు గ్రామ సమీపంలో వరి బస్తాలను ట్రాక్టర్‌లో లోడు చేస్తున్న రైతులు



ముత్యాలపాడులో తడిసిన వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హౌసింగ్‌లో వంద రోజుల కార్యాచరణ

- గృహ నిర్మాణ శాఖ ఏఈ నరసింహారావు



చాగలమర్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణశాఖలో చేపట్టిన పక్కా గృహాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణకు లక్ష్యాలు నిర్దేశించిందని గృహ నిర్మాణశాఖ ఏఈ నరసింహారావు తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో జగనన్న లేఔట్‌లు ఎన్ని ఉన్నాయి?

జవాబు: మండలంలో 15 జగనన్న లేఔట్‌లు ఉన్నాయి. 1,568 ఇళ్లకు గాను 228 గృహాలు పూర్తయ్యాయని, 808 గృహాలకు బేస్‌మెంట్‌లు వేశారు. మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రశ్న: సిమెంట్, ఇనుము అందుబాటులో ఉందా?

జవాబు: సిమెంట్, ఇనుము లబ్ధిదారులు అడిగితే తెప్పించి ఇస్తాం. అలాగే బిల్లులు కూడా వెంటనే అందజేస్తాం.

ప్రశ్న: ప్రధానమంత్రి గ్రామీణ యోజన గృహాలు పూర్తయ్యాయా?

జవాబు: 438 గృహాలు మంజూరు కాగా 125 గృహాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. జన్ మన్ పథకంపై చెంచులకు ఆరు గృహాలు మంజూరయ్యాయి.

ప్రశ్న: పక్కా గృహాల లబ్ధిదారులకు 90 రోజుల పని దినాలు కల్పిస్తున్నారా?

జవాబు: పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఉపాధిహామీ ద్వారా 90 రోజుల పనిదినాలు కల్పించి వారికి బిల్లులు మంజూరు చేస్తున్నాం.

ప్రశ్న: పక్కా గృహాలు నిర్మించుకోకుంటే రద్దు చేస్తారా?

జవాబు: మండలంలో పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారుడు డిసెంబరు చివరి వరకు పూర్తి చేసుకోవాలి. లేకపోతే గృహాలు రద్దు చేస్తారు. ఈ విషయం గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహాలు నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

ఉపాధి పనులపై విచారణ

చాగలమర్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృంద డీఆర్పీ గోవర్ధన్ ఆదివారం విచారణ ప్రారంభించారు. గ్రామంలో 22వేల పనిదినాలు కూలీలకు కల్పించినట్లు రికార్డులో నమోదు చేశారని తెలిపారు. రూ.51.50 లక్షలు ఖర్చు చేశారని అన్నారు. సచివాలయం, సీసీ రహదారులు, హార్టికల్చర్‌కు రూ.25.80 లక్షలు ఖర్చు చేశారని అన్నారు. వీటిపై గ్రామంలో విచారణ చేస్తున్నామని తెలిపారు. 11న గ్రామ సభలో చేసిన విచారణ నివేదికను వెల్లడిస్తామన్నారు.

పెన్షనర్స్ డేను జయప్రదం చేయాలి



పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న నిర్వహించనున్న పెన్షనర్స్ డేను జయప్రదం చేయాలని డోన్ పెన్షనర్ల అసోసియేట్ అధ్యక్షులు సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో కార్యదర్శి గాలయ్యతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షనర్లకు ఒకటో తేదీన పింఛన్ ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పెన్షనర్స్ డేను జయప్రదం చేయాలని సభ్యులకు పిలుపునిచ్చారు. అనంతరం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెన్షనర్లను సన్మానించారు. సమావేశంలో సంఘం నాయకులు గోపాల్, రామకృష్ణారెడ్డి, మౌలాలి, హుశేన్ సాహెబ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

11న బండలాగుడు పోటీలు

చాగలమర్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సత్యమ్మతల్లి దేవాలయం ప్రారంభాన్ని పురస్కరించుకొని 11న ఒంటెద్దుబండి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీరాముడు, శేఖర్, చంటి పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు మొదటి బహుమతి రూ.10,016, రెండో బహుమతి రూ.8,016, మూడో బహుమతి రూ.6,016, నాల్గో బహుమతి రూ.4,016, ఐదో బహుమతి రూ.2,016, ఆరో బహుమతి రూ.1,016 నగదు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి పాల్గొనాలని అన్నారు. సత్యమ్మతల్లి దేవాలయం ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కాలనీలో సౌకర్యాలు కల్పించాలి

డోన్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ శివారు కాలనీలో ఉన్న కేఈ కృష్ణమూర్తినగర్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని కాలనీవాసులు మాధవస్వామి, రంగన్న, సుంకులమ్మ, మద్దమ్మ కోరారు. 20 ఏళ్లుగా కనీస సౌకర్యాలు లేక కాలనీలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేటికి సిమెంటు రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు ఏర్పాటు చేయలేదని వాపోయారు. కాలనీలో వసతులు కల్పించాలని వేడుకుంటున్నారు.

అండగా ఉంటా: బీసీ రాజారెడ్డి



అమడాల మద్దిలేటిని పరామర్శిస్తున్న బీసీ రాజారెడ్డి

కోవెలకుంట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడు అమడాల మద్దిలేటి కుటుంబానికి అండగా ఉంటానని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మద్దిలేటి రెడ్డి గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం గ్రామానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా బీసీ కుటుంబం అండగా ఉండి ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు శ్రీనిధి హోటల్ మద్దిలేటి, టీడీ పీ నాయకులు సౌదరదిన్నె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బనగానపల్లె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సురేశ్ విద్యుదాఘాతంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆదివారం పరామర్శించారు. బతుకుదెరువు కోసం సురేశ్ విజయనగరం జిల్లా సాలూరుకు వెళ్లారు. నాలుగురోజుల క్రితం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీసీ రాజారెడ్డి సురేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. బీసీ రాజారెడ్డి వెంట నాయకులు మాజీ సర్పంచ్ రామిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, తదితరులున్నారు.